రాజకీయ కక్షలతో జనం నడ్డి విరుస్తరా?

చింతలపల్లి స్వామిరెడ్డి

తెలంగాణ పీఠభూమి.. ఎత్తిపోతలే శరణ్యం • కేసీఆర్ ఆలోచనలో తప్పేముంది?

సీడబ్ల్యూసీ సూచనల మేరకే 'మేడిగడ్డ' నిర్మాణం • ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి ఆక్రోశం

చందాలు వేసుకుని కాళేశ్వరంను బాగు చేసుకుందామని పిలుపు • సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో

కరీంనగర్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): 'చరిత్రలో రాజులు, చక్రవర్తుల పాలన చూసినా ప్రజారంజకంగా ఉండేది. రాచరిక పాలనలో సైతం ప్రజల అభీష్టానికి గౌరవం ఉండేది. కానీ.. తెలంగాణ ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా పాలన సాగిస్తున్నది. రాజకీయ వైరానికి పోయి ప్రజలపై పగ పెంచుకుంటున్నట్టుగా ఉన్నది' అంటున్నారు కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చింతలపల్లి స్వామిరెడ్డి. స్వామిరెడ్డి రైతు కూడా. గడిచిన పదేండ్లలో రైతులు ఎంత సుభిక్షింగా ఉన్నారో.. ఈ నాలుగు నెలల్లో ఎంతటి దుర్భర స్థితిని ఎదుర్కొంటున్నారో.. వివరిస్తూ సోషల్ మీడియాలో ఆయన చేసిన ఆడియో రికార్డు వైరల్‌గా మారింది. ఆయన మాటల్లోనే.. 'తెలంగాణ పీఠభూమి ప్రాంతం. ఎత్తు పల్లం ఉన్నది కాబట్టి మనం నదులపై ప్రాజెక్టులు కట్టుకోవడం, ఎత్తిపోతలు నిర్మించుకోవడమే ముఖ్యం. ఆంధ్రాలాగా మనది సమతల భూ ప్రాంతం కాదు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు కాళేశ్వరం ఎత్తిపోతల విషయంలో తీసుకున్న నిర్ణయం సరైనదని నేను ఘంటాపథంగా చెప్పదల్చుకున్న. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే ఎల్లంపల్లికి మాత్రమే ఉపయోగపడుతుందని అప్పటి సీడబ్ల్యూసీ నివేదిక మేరకే కేసీఆర్ మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేండ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేశారు. మనకు ఉన్న 32 పండ్లలో ఒక పన్నుకు నొప్పి కలిగితే దానిని బాగు చేసుకునే ప్రయత్నం చేస్తాం. అవసరమైతే దానిని తీసేసి కొత్త పన్ను పెట్టుకుంటం. ఇది కూడా అంతే.. పిల్లర్లు పోయినయి.. ఇది పోయింది.. అది పోయిందని చెప్పుకుంటూ కాలయాపన చేసుకుంటాపోతే ప్రజల నడ్డి విరుచుడు తప్ప ఏమీ లేదని నేను చెప్పదల్చుకున్న. బీఆర్ఎస్ తల్చుకుంటే చందాలు వసూలు చేసి కాళేశ్వరం నిర్మించగలదు. పార్టీ సభ్యత్వం 60 లక్షలు ఉంది. తలా రూ.వెయ్యి వేసుకున్నా రూ.6 కోట్ల చిల్లర అవుతుంది. మేడిగడ్డ వద్ద కాఫర్‌డ్యాంను నిర్మించుకునేందుకైనా ముందుకు రావాలని నేను కోరుతున్న. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నేను సవినయంగా విజ్ఞప్తి చేస్తున్న. నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఆంధ్రా నాయకులు వాళ్లు అనుకున్న స్థలంలోనే నిర్మించుకోగలిగారు. ఇది మనకు ఏమైనా ఉపయోగం ఉన్నదా? వాళ్లకే ఎక్కువగా ఉపయోగం ఉన్నది. ఏపీ మనకు ఎక్కువ అన్యాయం చేసింది. కేంద్రం పేరు చెప్పి నీటి వాటాను ఎగ్గొట్టింది. కేంద్రం కూడా తాత్సారం చేయడం, తెలంగాణకు అన్యాయం జరిగింది. రాజులు, చక్రవర్తులు కూడా ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకుని పాలించారు. ఇప్పుడు ప్రజల అవసరాలను గుర్తించకుండా రాజకీయ కక్షలకు పోతూ జనం నడ్డి విరుస్తున్నారు. ఏ ప్రభుత్వం బాగుంది? ఏ ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగించిందనేది ప్రజలు కూడా ఆలోచించాలి. కేసీఆర్‌ను దృష్టిలో పెట్టుకోకుండా ప్రజలను దృష్టిలో పెట్టుకుని పాలన సాగించడం మంచిదని తెలంగాణ ప్రభుత్వానికి సవినయంగా విన్నవించుకుంటున్న. గత పాలకులు ఎవరైనా తప్పు చేస్తే చట్ట పరంగా వారిపై విచారణ జరపండి. దోషులని తేలితే శిక్షించండి. కానీ వారిపై కోపంతో ప్రజలను ఎందుకు నష్టపరుస్తున్నారని నేను అడుగుతున్న. ఓటు వేసిన ప్రజలను ఎందుకు విస్మరిస్తున్నారు. ఫర్ ద పీపుల్.. ఆఫ్ ద పీపుల్.. బై ద పీపుల్ అని చెప్పిన అబ్రహం లింకన్ మాటలు దృష్టిలో పెట్టుకొని ప్రజలు కోరుకున్న పాలన సాగించాలి. ఈ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలి. లేదంటే ప్రజలు, రైతులే ముందుకు వచ్చి చందాలు వేసుకుని కాఫర్ డ్యాంను నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాజెక్టులను నింపుకోవడానికి అవకాశాలు ఉంటాయి. ఇప్పటికైనా ప్రజల మంచిని కోరుకోవాలని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సవినయంగా విజ్ఞప్తి చేస్తున్న' అని విశ్రాంత ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

తాగునీళ్లు అడిగితే కేసు

మొదటిపేజీ తరువాయి...

భగీరథ ఏఈ స్రవంతి, స్థానిక పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తండాలో తాగునీటి సమస్య పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు వారితో తమ కష్టాలు మొరపెట్టుకున్నారు.నీళ్లు రాకపోవడంతో డబ్బులు ఖర్చుచేసి ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమం లో అధికారులకు ఫిర్యాదుచేసిన రాజు, స్థానిక వాటర్‌మన్ శ్రీనునాయక్ మధ్య వాగ్వాదం జరిగింది. దీనిని తీవ్రంగా తీసుకున్న శ్రీనునాయక్ రాజుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాజాగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తనపై కేసు నమోదుకావడంతో రాజు ఆవేదన వ్యక్తంచేశాడు. నీళ్లు అడిగితే కేసు పెట్టడం ఏమిటని వాపోయాడు.

తాగునీటిపై రోజూ సమీక్షించాలి

కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు తాగునీటి సరఫరాపై రోజూ పర్యవేక్షించాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ప్రతి ఇంటికి సరిపడా నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో తాగునీటి పరిస్థితి, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పాఠశాలల్లో అత్యవసరపనుల నిర్వ హ ణ, వడదెబ్బ నివారణ చర్యలపై బుధవారం ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి పరిస్థితిని నిశితంగా పరిశీలించి, నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా సమష్టిగా పని చేసినందుకు కలెక్టర్లను సీఎస్ అభినందించారు. వేసవిలో నీటిఎద్దడి నివారణకు కలెక్టర్ల వద్ద తగినన్ని నిధులు అందుబాటులో ఉంచామని, ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించి నీటి సరఫరాలో వస్తున్న అంతరాయాల వివరాలను నేరుగా ప్రజల నుంచి అడిగి తెలుసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, టార్పాలిన్ల వంటివి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పాఠశాలల్లో అత్యవసర మరమ్మతు పనులకు నిధులు విడుదలయ్యాయని, పనులు ప్రారంభించేందుకు ఎన్నికల సంఘం నుంచి అనుమతులు వచ్చాయని, వెంటనే పనులు వేగవంతం చేయాలని సూచించారు. వడగాడ్పులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, తదితర సిబ్బందికి అవగాహన కల్పించామని తెలిపారు. వేసవి జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం, సీడీఎంఏ దివ్య, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు దుఃఖం.. దళారికి రొక్కం

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించారు. కాంటా మాత్రమే పెట్టి, ఫొటోలు దిగి ఉన్నతాధికారులకు పంపించారు. కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు ఇంతవరకూ చేరలేదు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. దీంతో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రంలోని సిబ్బందిని అడిగితే బస్తా సంచులు వచ్చినప్పుడు కొనుగోళ్ల ప్రక్రియ మొదలుపెడతామని అంటున్నారు. యాసంగి వరి కోతలు మొదలై ఇప్పటికే పది రోజులు దాటింది. మరో వారం రోజుల్లో కోతలు పూర్తి కానున్నాయి. అప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు మొదలయ్యే పరిస్థితి కనిపించడలేదు.

హనుమకొండ జిల్లా ముచ్చర్ల నాగారం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు ఆరబోస్తున్న రైతు

దళారుల దగా..

ఓ వైపు ఎండలు.. మరోవైపు అకాల వర్షాల హెచ్చరికలు.. అయినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల రైతులు ధాన్యం కుప్పలతో పడిగాపులు పడుతున్నారు. ప్రతి రోజూ వడ్లను ఎండపోసి, కుప్పపోస్తున్నారు. దీంతో కూలీల భారం రైతులపై పడుతున్నది. ధాన్యం కుప్పలు తెచ్చి వారం రోజులు గడుస్తున్నా కొనుగోలు మాత్రం కావడంలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద ఐకేపీ సిబ్బంది ఎవరూ ఉండడంలేదు. దీంతో రైతులే సద్దికట్టుకుని కాపాలా ఉంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,203, సాధారణ రకం క్వింటాకు రూ.2.183లుగా కనీస మద్దతు ధర కల్పించింది. కొనుగోళ్ల కోసం వేచి ఉండి విసిగి వేసారిన రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు క్వింటాకు రూ.200 ధర తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పైగా కల్లాల్లోనే తాలు పట్టి తెస్తేనే కొంటామని వ్యాపారులు మెలిక పెడుతున్నారు. మొత్తం వడ్లను తూర్పార పట్టడం అంటే కూలీ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని, ఇంత చేసినా పండిన పంటకు కనీస మద్దతు ధర రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సదుపాయాలు కరువు

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కొనుగోలు కేంద్రాల వారీగా వచ్చే వడ్లను తరలించేందుకు ప్రభుత్వం రైస్‌మిల్లులను కేటాయిస్తున్నది. ప్రస్తుత సీజన్‌లో ఇలాంటి ప్రక్రియను ఇప్పటికీ పూర్తి చేయలేదు. కాంటా పెట్టిన వడ్లను ఏ మిల్లుకు తరలించాలనేది ఇప్పటికీ స్పష్టత రాలేదు. కొనుగోలు కేంద్రాల్లో మాయిశ్చర్ చూసి టోకెన్లు అందజేయాల్సిన వ్యవసాయ అధికారులకు ఇంతవరకు టోకెన్ బుక్కులు అందలేదు. తీవ్రమైన ఎండలు ఉన్నా కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు కొనుగోలు కేంద్రంలో రైతులు ఉండేందుకు నీడ లేకపోవడంతో టెంట్ వేశారు. అది గాలులకు కూలిపోయింది. పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వడ్లు ఆరబోసేందుకు సిమెంటు గచ్చు లేకపోవడంతో కమలాపూర్ మార్కెట్ యార్డులో ఐకేపీ కొనుగోలు కేంద్రానికి రైతులు వడ్లను తరలిస్తున్నారు. కమలాపూర్ మండలంలో మొత్తం 16 కొనుగోలు కేంద్రాల్లో ఒక్క ఉప్పల్ కొనుగోలు కేంద్రానికి మాత్రమే బస్తా సంచులు వచ్చాయి. మిగిలిన కేంద్రాల్లో సంచులు లేక పోవడంతో కొనుగోళ్లు జరగడంలేదు.

తొందరగా వడ్లు కొనాలి

మార్కెట్‌కు వడ్లు తెచ్చి మూడు రోజులు దాటింది. ఇక్కడికి ఎవరూ రాలే. తేమ చూసే సార్లు కూడా రాలే. రోజుకు ఐదారు సార్లు వడ్లను నేర్పుతున్నా. ఇప్పటికైనా తొందరగా కాంటాలు పెట్టి వడ్లను కొనాలే.

- అర్తం రమ, ఎల్కతుర్తి, హనుమకొండ జిల్లా

2 కిలోల కోత పెడుతున్నరు

ఐకేపీ కొనుగోలు కేంద్రంల వడ్లు ఆరబెట్టిన. ఇంకా బార్దాన్ రాలేదంటున్నరు. ఎప్పుడు ఇస్తరో ఎవరూ చెప్తలేరు. మిల్లర్ల వద్దకు పోయి బార్దాన్ తెచ్చుకుని వాళ్లకే రైతులు అమ్ముతుండ్రు. అక్కడ నూక, తాలు, తేమ అని చెప్పి కాంటాల్లో 2 కిలోల కోత పెడుతున్నరు. కాంటాలు కాకపోతే ఖర్చులు మీద పడుతున్నయ్. మిల్లర్లు అడిగినకాడికి అమ్ముకుంటున్నం.

- కిన్నెర గోపి, కమలాపూర్, హనుమకొండ జిల్లా.

ఎప్పుడు కొంటరో

నాకు మూడెకరాల పొలం ఉన్నది. వరి కోసి వడ్లను ఐకేపీ సెంటర్‌లో పోసి ఐదు రోజులైతాంది. వడ్లు మంచిగ ఎండినయ్. తేమ 15 శాతం వస్తున్నదని కుప్పపోసిన. ఎప్పుడు కొంటరో అని ఎదురుచూస్తున్న. వడ్లు కాంటా అయ్యి మిల్లుకు పోయే వరకు కొనుగోలు కేంద్రంల రైతులదే బాధ్యత అని చెప్పుతున్నరు. బార్దాన్ అయితే ఇస్తలేరు. ఎప్పుడు కొంటరో ఏందో?

-వెంగల రాజేశ్, కమలాపూర్, హనుమకొండ జిల్లా.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	39.9°c	22.1°c
మెదక్	39.0°c	23.1°c
మహబూబ్‌నగర్	38.8°c	27.4°c
నల్లగొండ	38.7°c	24.4°c
ఆదిలాబాద్	38.3°c	21.7°c
ఖమ్మం	38.0°c	24.0°c
నిజామాబాద్	38.0°c	24.5°c
వరంగల్	37.0°c	25.0°c
కరీంనగర్	37.0°c	25.0°c
హైదరాబాద్	36.8°c	24.9°c

మరో 5 రోజులు రెయిన్ అలర్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి మరో 5 రోజులు వాతావరణ శాఖ అధికారులు రెయిన్ అలర్ట్ జారీచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడిన ఆవర్తన ద్రోణి కారణంగా రెండు రోజులుగా రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రావణి తెలిపారు. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు మధ్య ఆవర్తన ద్రోణి ఏర్పడిందని, ఈశాన్య రాజస్థాన్ నుంచి మరఠ్వాడా మీదుగా మరొక ఉపరితల ద్రోణి ఏర్పడిందని చెప్పారు. వీటి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు తగ్గి చల్లని వాతావరణం నెలకొన్నదన్నారు. గత 24 గంటల నుంచి 20 – 30 కి.మీ వేగంతో గాలులు వీచాయని.. వచ్చే ఐదు రోజులూ ఇలాగే ఉంటుందని డాక్టర్ శ్రావణి వివరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షసూచన ఉందని తెలిపారు. 12వ తేదీ నుంచి దక్షిణ తెలంగాణ జిల్లాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు డాక్టర్ శ్రావణి తెలిపారు.

జనగామ మార్కెట్ కార్యాలయం వద్ద అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

ధాన్యం ధర తగ్గించడంపై రైతుల ఆందోళన

- జనగామ మార్కెట్‌లో ఉద్రిక్తత
- రేపటిలోగా మద్దతు ధర ఇవ్వాలి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : ధాన్యం ధరను తగ్గించారని ఆరోపిస్తూ బుధవారం సాయంత్రం రైతులు జనగామ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మార్కెట్ కార్యదర్శి, ఇతర అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ధాన్యం క్వింటాల్‌కు రూ.2,200 మద్దతు ధర కల్పించాల్సి ఉండగా, మంగళవారం వరకు రూ.1,900 చొప్పున కొనుగోలు చేశారు. బుధవారం ఆలస్యంగా వేలం పాటలను ప్రారంభించిన వ్యాపారులు తేమ, తాలు శాతం అధికంగా ఉందన్న కుంటిసాకులు చెప్పి 10 వేల బస్తాలను ఆన్‌లైన్‌లో రూ.1,500కు తగ్గించి కొనుగోళ్లకు సిద్ధం కావడంతో రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. 'మీ వెంట నేనుంట. ఎట్లా కొనరో చూద్దాం.. రేపు సెలవైనా యార్డులో ఉన్న ధాన్యం అంతా మద్దతు ధరకు కొనాలి.. లేకుంటే యార్డుకు వచ్చి కూర్చుంట' అని రైతులకు మద్దతు ప్రకటించారు. మద్దతు ధర, కొనుగోళ్లలో జాప్యం, వ్యాపారుల సిండికేట్ వంటి అంశాలపై రైతులతో కలిసి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు.

మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

ఆన్‌లైన్‌లో ధాన్యం ధర తగ్గించి కొనుగోళ్లకు సిద్ధమైన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు బాధ్యుడైన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదేశించారు. మార్కెట్‌కు వచ్చిన అదనపు కలెక్టర్‌ను రైతులు చుట్టుముట్టి.. వ్యాపారులు తమను నిండా ముంచుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పుట్టంగండి వద్ద అత్యవసర మోటర్ల ఏర్పాటు

జీరోపాయింట్ వద్ద 3 కోట్లతో పనులు

10 మోటర్లతో రోజుకు 900 క్యూసెక్కుల తరలింపు

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 10 : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకు గణనీయంగా తగ్గుతున్నది. దీంతో అవసరమైన నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోసి నల్లగొండ జిల్లాతోపాటు జంటనగరాల తాగునీటి అవసరాలకోసం తరలించేందుకు హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు చర్యలు చేపట్టింది. నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద రూ.3 కోట్లతో పనులు చేపట్టింది. 600 హెచ్‌పీ సామర్థ్యం గల 5 మోటర్లు, 300 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మరో ఐదు మోటర్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు.ఇప్పటికే విద్యుత్తులైన్ పనులు పూర్తి కాగా, జీరో పాయింట్ వద్ద ఉన్న షెడ్‌లో మోటర్లు బిగిస్తున్నారు. వీటి ద్వారా సాగర్ వెనుక జలాల నుంచి రోజుకు 900 క్యూసెక్కులను పుట్టంగండి అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తిపోయనున్నారు. మొన్నటి వరకు సాగర్‌ప్రాజెక్టు నీటిమట్టం 512 అడుగుల వరకు ఉండటంతో మోటర్ల ఏర్పాటు సాధ్యం కాలేదు. ప్రస్తుతం నీటిమట్టం 510 అడుగులకు తగ్గడంతో పనులు వేగవంతం చేశారు. 2016, 2017, 2019లోనూ మోటర్లు ఏర్పాటు చేసి సాగర్‌లో 500 అడుగుల వరకు ఉన్న నీటిని తరలించారు. కొన్ని సందర్భాల్లో నదిలో కాల్వ తవ్వకం చేపట్టి నీటిని పుట్టంగండి మోటర్లకు అందించారు. ప్రస్తుతానికి డ్రెడ్జింగ్‌తో పనిలేకుండా నీటిని తరలించనున్నారు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ ద్వారా హైదరాబాద్‌కు 520 క్యూసెక్కులు (1230 ఎంఎల్‌డీ) నీటిని తరలిస్తున్నప్పటికీ రానున్న రెండు నెలల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మరో ఐదారు రోజుల్లో అత్యవసర మోటర్లను నడపనున్నట్టు డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పుట్టంగండి జీరో పాయింట్ వద్ద ఏర్పాటు చేస్తున్న మోటర్లు

గిట్టుబాటు ధరపై మిర్చి రైతుల ఆందోళన

కేసముద్రం మార్కెట్ కార్యాలయం ముట్టడి

కేసముద్రం, ఏప్రిల్ 10: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో మిర్చి ధర తగ్గిందని రైతులు ఆందోళన చేశారు. ఈ మేరకు మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. బుధవారం మిర్చి క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలికింది. మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం మార్కెట్లలో క్వింటాల్ మిర్చి ధర రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలికిందని తెలుసుకున్న రైతులు కేసముద్రం మార్కెట్లో ఆందోళన చేశారు. వ్యాపారులు కుమ్మక్కై కావాలని ధరలు తగ్గిస్తున్నారని ఆరోపించారు. తేమ శాతం తక్కువగా ఉన్న నాణ్యమైన మిర్చికి కూడా వ్యాపారులు ధరలు తగ్గించాలని రైతులు పేర్కొన్నారు. ఈ ధరకు అమ్మితే కూలీలకు ఇచ్చిన డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న మార్కెటింగ్ శాఖ డీఎన్‌వో వెంకటరెడ్డి, సీఐ సర్వయ్య ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులు, రైతు సంఘం నాయకులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. వ్యాపారులు క్వింటాల్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు పెంచడంతో రైతులు ఆందోళన విరమించారు.

కూలీగా బతికి.. కౌలుతో చితికి..

- అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య
- వైకల్యం ఉన్నా కూలీగా విజయం
- భార్య, పిల్లలతో హాయిగా జీవనం
- భూమి కౌలుతో పెరిగిన ఆర్థిక భారం
- పంట దిగుబడి రాక బలవన్మరణం

ఆత్మహత్య చేసుకున్న భర్త రమేశ్ ఫొటోతో భార్య లక్ష్మి, కొడుకు కార్తీక్

సంగారెడ్డి, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): కడు పేదరికంలో ఉన్న దళిత కుటుంబం వారిది. కూలీనాలీ చేసుకుంటేనే కూడు దొరికే పరిస్థితి. చిన్నప్పుడే పోలియో రావడంతో కుడి కాలు సరిగ్గా నడవలేని దుస్థితి. వైకల్యం వెన్నాడినా.. వెన్ను చూపకుండా కాయకష్టం చేసి బతుకుసాగించాడు. గుంట భూమి లేకపోవడంతో కౌలు మీద ఆధారపడి సాగు మొదలు పెట్టిండు. కాలం కలిసి రాక దిగుబడి లేకపోవడంతో దిగులు చెందిండు. కౌలు రైతులను ఆదుకుంటామన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తడంతో మరింత డీలా పడిండు. రోజురోజుకు పెరుగుతున్న అప్పులకు మిత్తీలు కట్టలేక.. పొలంలోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. తననే నమ్ముకున్న భార్య, పిల్లలను అనాథలను చేసి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతి(బి) గ్రామానికి చెందిన దళిత రైతు న్యామతాబాద్ రమేశ్. పోలియో కారణంగా రమేశ్ కుడికాలు సరిగ్గా నడవలేని పరిస్థితి. పేదరికం కారణంగా రమేశ్ పెద్దగా చదువుకోలేదు. సాగు భూమి లేకపోవడంతో కుటుంబానికి అండగా ఉండాలని రైతు కూలీగా మారాడు. పెళ్లీడు వచ్చాక తల్లిదండ్రులు రేగోడ్‌కు చెందిన లక్ష్మితో వివాహం జరిపించారు. రమేశ్, లక్ష్మి కూలీ పనిచేస్తూ తమ ఇద్దరు కొడుకులను చదివిస్తున్నారు. పెద్ద కొడుకు రాఘవేంద్ర చేర్యాల్‌లోని గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతుండగా, చిన్న కొడుకు కార్తీక్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. సంసారం బాగా సాగుతుండటంతో రమేశ్ మూడేండ్ల నుంచి కౌలుకు భూములు తీసుకుని సాగు చేయటం ప్రారంభించాడు.

కాలం కలిసిరాక ...

కౌలురైతుగా మారిన రమేశ్‌కు కాలం కలిసిరాలేదు. గత ఏడాది గ్రామంలోని ఓ పెద్ద రైతు భూమి కౌలుకు తీసుకుని చెరుకు పంట వేశాడు. ఆశించిన పంట దిగుబడి రాక రమేశ్‌కు అప్పులు మిగిలాయి. ఇంటి నిర్మాణానికి మరో రూ.3 లక్షలు అప్పు చేశాడు. అప్పులు చెల్లించాలని ఇచ్చినవారు ఒత్తిడి తీసుకువస్తున్నారు. మరోవైపు సెలవులపై ఇంటికి వచ్చిన పెద్దకొడుకు అనారోగ్యానికి గురయ్యాడు. అబ్బాయి చికిత్సకు ఇబ్బంది అవుతోంది. కౌలు రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సహాయం చేస్తామన్న ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేదు. అప్పులు తీర్చే మార్గం కనిపించక రమేశ్ మానసికంగా కుంగిపోయాడు. దీంతో ఫిబ్రవరి 1న పొలానికి వెళ్లొస్తానని భార్య లక్ష్మికి వెళ్లిన రమేశ్ మళ్లీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెళ్లి చూస్తే చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఇంటికి పెద్ద దిక్కు పోవడంతో భార్య లక్ష్మి, పిల్లలు రాఘవేంద్ర, కార్తీక్, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

మాకు దిక్కెవరు ?

"చిన్నప్పుడే నా తల్లిదండ్రులు చనిపోయారు. అనాథ అయిన నన్ను మేనమామ సాకి పెండ్లి చేశాడు. రమేశ్, పిల్లలు వచ్చాక నా జీవితంలో ఆనందం వచ్చింది. వాళ్లే లోకంగా బతికాను. నేను నమ్ముకున్న రమేశ్ నాకు దూరమైండు. పొలానికి నీళ్లు పెట్టి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు ఆర్థిక సహాయం ఇస్తే నా భర్త బతికేవాడు. మాకు గుంట భూమిలేదు. రైతుబీమా రాదు. ఇగ మాకు దిక్కెవరు ? మా పరిస్థితి చూసి ప్రభుత్వం స్పందించాలి. మమ్మల్ని ఆదుకోవాలి."

-న్యామతాబాద్ లక్ష్మి, రమేశ్ భార్య

సాగునీటిపై నోరెత్తొద్దు

మొదటిపేజీ తరువాయి...

విమర్శలు వెల్లువెత్తున్నాయి. మరోవైపు ప్రధాన ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీళ్లున్నా పంటలకు మళ్లించడం లేదని సూర్యాపేట పర్యటన సందర్భంగా గణాంకాలతో వివరించారు. దీంతో ఈ సమాచ